# మేధావి

శ్రీ రంధి సోమరాజు

ప్రొద్దుటపట్టిన ముసురు మధ్యమధ్య తెగబాది ఇంకా ముసురు కుంటూనే వుంది అడుగు తీసి అడుగు వేసేప్పటికి మిలటరీ జోళ్ళంత బరువు బురద గడ్డి పరకలతో కలసి పాదాల పాకం పట్టేస్తూంది. అక్కడక్కడ తుమ్మ ముళ్ళు కాళ్ళల్లో విరుగుతూనే ఉన్నాయి. ఒక్కొక్కచోట మోకాళ్ళదాక దిగబడి పోగా ఆ కూరుకపోయిన కాళ్లు, లాక్కోలేని నిస్సత్తువతో కాస్సేపలాగే నిలబడి పోయి, తిరిగి ఉస్సురంటూ కాళ్లు సడలించి ముసురు నెంతో ఈసడించి, తొడలపైదాక ఎత్తి కచ్చా పోసిన చీరలతో, భుజాలమీద బిందెలతో చెరువుదగ్గఱకు వస్తూ పోతున్నారు పల్లెపడుచులు. వాళ్ల వొళ్ళంతా తడిసే వుంది వంటికంటుకపోయిన రంగు రంగుల రవళి రవికలు, ఆ వంటి ఒంపు సొంపుల నిగ్గు తేల్చే నీరు మేసిన వన్నెచిన్నెల చీరలు — చూసి చూసి, మురిసి మురిసి, ముచ్చటైన ముసురు ముద్దులు కురిసి కురిసి మోహానంగా తొండ విస్తూంది పూరికొంపలపైనుంచి ప్రాకిపోయే పొగలు వగలు జిమ్ముతూ, వొయ్యారంగా పోయిపోయి మొగిలి మొగుడు గుండెలో లీనమై పోతున్నాయి

అచ్చన్న నులకతాడు పేనుకుంటూ అరుగుమీద మూగిన ఈగల్ని తోలుతున్నాడు. అరుగెక్కి తడిసిన కోడిపుంజు రెక్కలు టపటపా కొట్టి జుత్తునెత్తి సగర్వంగా 'కొక్కరో కో' అంది. అప్పుడే తెల్లవారుతూం దని అనుకుందో ఏమో పాపం!

పచ్చి ఇటుకతో కట్టిన ఆ పొట్టిగోడల ఇంటి పైకప్పు—కప్పుకున్న తాటియాకు —తల వొంపించి కాని ఎవ్వరినీ అసలు లోనికి కదలి పోనీదు. రెండు కిటుకీలాఅరుగుమీద ఉన్నాయిగాని అవి తెఱచి మాత్రం లేవు. గుమ్మం దాటగానే చీకటి కొట్టులా ఉన్న ఆ గదిలో గబ్బిలాల కంపు గుప్పున కొట్టకుండా ఉండదు గాలి లేని వెలుతురులేని ఆ గదిలో ఓ చెక్క కూర్పు ధాన్యం నిల్వకొట్టు వుంది. దాని అడుగున ఎలుకలు పట్టపగలే వీరవిహారం చేస్తూ వుంటాయి. ఈ పాపాత్ములను సంహరించడానికి పిల్లిభగవానులు అప్పుడప్పుడు అవతరిస్తూ ఉంటారు ఆ గదిలోనే మరో ప్రక్క రెండు పటాలున్నాయి. ఒకటి లక్ష్మీదేవిది; మరొకటి విఘ్నేశ్వరుడిది. ఈ రెండు పటాల నల్ల ఫ్రేములమీద మసి పట్టిన బూజు ఉంది. అడుగునుంచి ఆ పటాలను చెద తినివెయ్యడంవల్ల, లక్ష్మికి రెండు కాళ్ళూ లేకుండా పోయాయి వినాయకుని ఎలుక పూర్తిగా తినివేయబడింది. ఈవిధంగా ఆ చెద ఆ దేవుళ్ళను ఆ ఇంట్లో పాతేసింది! అయితే ఆ చెదకు పూర్తిగా ఆగ్రహంవస్తే ఆ దేవుళ్ళను మెల్లగా తినేస్తుంది అద్దం అద్దంలా ఉండగానే దేవుళ్లు మాయమైపోతారు!

ఈ పటాలకు ప్రక్కగా చెంబులబల్ల ఉంది. దానిమీద ఇత్తడిసామాను కిలుంపట్టి మూలుగుతూంది ఆ బల్లక్రింద ఒక కావిడపెట్టె, ఆ పెట్టెమీద ఓ వెదురు బుట్ట ఉన్నాయి ఆ బుట్ట చినిగి ఉంది. ఆ పెట్టెకు నల్లనిమట్టి దిట్టంగా అంటుకపోయి ఉంది బుట్టలో ఉదికిన బట్టలూ పెట్టెలో ఉప్పూ కారం, చింతపండూ వగైరాలు చిక్కొగ్గాపడి ఉన్నాయి ఆపెట్టె తెరిస్తే అదోరకం అన్నిరకాల వస్తువుల కలగలపు కంపు బయటకు తరుముకొస్తుంది. వీటికి ప్రక్కగా దణ్ణెం ఉంది దానిమీద మాసినవి, ముక్కిపోయినవి, చింకిగుడ్డలు అసహ్యంగా పడి ఉన్నాయి. ఆఇంట్లోనే ఓమూల బిందెలున్నాయి ఆ బిందెలమీద నీళ్ళకు మూతల్లేవు. కాని ఇవి మెరుస్తూన్నంత చక్కగా ఆ ఇల్లు మట్టుకు లేదు.

ఆ గదితరువాత సామాను గది వుంది అదీ మొదటిగదంత పొడుగే వుంది. కాని వెడల్పు తక్కువ. అందులో పుల్లలు వంట సామగ్రి క్రిక్కిరిసి ఉన్నాయి. ఆ గది గోడలన్నీ పొగత్రాగి నల్లబడిపోయిన పెదవుల్లా ఉన్నాయి దీనికావల చిన్న పంచ ఉంది. అందులోనే వాళ్ళకు వంట తయారవుతూంది. అక్కడే బుచ్చమ్మకూర్చొని ప్రొయ్యి రాజేస్తూంది

ఆ చివర అచ్చన్న, ఈచివర బుచ్చమ్మ ఏవేవో మాటలు సణుగుకుంటూ వుంటారు. అచ్చన్న అప్పుడప్పు డొకూని రాగం తీస్తాడు బుచ్చమ్మ ఎప్పుడూ మట్టిబొక్కినదానిలా మాటా మంతీ లేకుండా తనపనేమిటో తనేమిటోలా ఉంటుంది. మనిషి చామనచాయగా కుంచంలా ఉంటుంది. పౌర్ణమినా డుదయించే చంద్రుడంత బొట్టు పెట్టుకుంటుంది ఎప్పుడూ జేగురు రంగు చీరలే కడుతుంది. అచ్చన్న నల్లగచ్చులా ఉంటాడు నల్లని తెల్లని వెంట్రుకల కలగలుపు జుత్తుముడి, పెద్ద మీసాలు, కొన తేలిన ముక్కు, తెలివి ప్రదర్శించలేని కళ్లూ చూడ్డాని కేమంత చికాకు పుట్టించేవిగా ఉండవు.

అచ్చన్న అష్టకష్టాలూ అనుభవించాడు. బుచ్చమ్మా అతనూ పనికిపోనిరోజు ఉండేది కాదు. రోజుకు పావలా వచ్చినా, అర్థ వచ్చినా, అందులోనే కొంత జాగ్రత్త చేసేవారు. అన్నం వండుకొని, గంజి పోసుకొని, ఇంత ఉప్పురవ్వ కలుపుకొని, పచ్చిమిరపకాయ నంజుకుంటూ అమృతంలా జుర్రేవారు. ఎప్పుడు తినేవారో ఎప్పుడు కునికేవారో ఆ వూరివారికి విచిత్రంగా ఉండేది. ఎప్పుడూ ఏదో పని చేస్తూనే ఉండేవారు. పనే వారి జీవితం. వారికి తిండిమీద ధ్యాసే ఉండేది కాదు. వాళ్ళకొరుచులూ తెలియవు. వాళ్లకా పని అంటేనే పెద్దరుచి అదంటేనే వాళ్ళకెంతో అభిరుచి. సరైన బట్టకూడ కట్టుకోవాలని వాళ్ళ కెప్పుడూ తట్టలేదు. సగంతిని; సగందాచి — తరుముకొస్తూన్న ముసలితనపు మొద్దు బండికి, గుడ్డి ఎద్దుకు దాణాగా వినియోగించుకోవాలనే తహ తహ మినహాయిస్తే—అంతకు మించి మరో ఆలోచనే వారికిలేదు. ఇహ ఉన్న ఒక్క కొడుక్కీ ఏమీ ఇవ్వలేని చేతగాళ్ళయి పోవడం వాళ్ళ కెట్లా ఇష్టమౌతుంది? ఇంత కష్టపడీ ప్రతి దమ్మిడీ వమ్ముకాకుండా వాటి సొమ్ము చేసుకోగలిగితే వాళ్ళ కున్నదంతా ఎంత అంటే—రెండెకరాల కొంప. ఇదీ వాళ్ళ ఆస్తి ఈ కాస్తకూ

# ★ మేధావి ★

లేనివాళ్ళే, అతని ఇరుగుపొరుగు పూరిగుడిసెల యజమానులు. వాళ్ళకచ్చన్న అంటే కిట్టదు ఈ కూలి వెధవ రెండెకరాల భూమి కొనడమే అని వాళ్ళ దుగ్ధ! కాని తెల్లారితే 'అచ్చన్న మావా ఓ రూపాయుంటే ఇయ్యరా. రేపొద్దున్న ఇచ్చేత్తాను' అని అడుక్కోకుండానూ ఉండలేరు. అయితే ఈ చెదపురుగులు ఆ దేవుడుపటిలకు పట్టినట్టే, అచ్చన్నదగ్గఱ పుచ్చుకున్న డబ్బు తినేసి, బాకీ ఉన్నట్టుగా మాత్రం మసిపట్టిన ఆ అద్దం మొహాలను ప్రదర్శించడంలో అఖండులు! ఇహ అచ్చన్న వాళ్ళదగ్గఱనుంచి ఎట్లా డబ్బు గుంజుకోవాలో సతతం తనలో తాను గింజుకుంటూనే ఉంటాడు. కాని ఫలితం చాల సందర్భాలలో శూన్యమే!

అచ్చన్న పూర్వం తన పనేమిటో తనేమిటో గానే ఉండేవాడు కాని ఇప్పుడందఱూ వచ్చి ఏవేవో కష్టసుఖాలు చెప్పుకుంటూవుంటే వినకుండా ఉండలేని అవస్థలో మునిగిపోతున్నాడు. ఇక వాళ్ళేవో గొడవలు చెపుతూ సలహాలడిగితే, పాపం ఎటూ కచ్చితంగా చెప్పలేని అసమర్థుడైన అచ్చన్న తెల్లమొహం వెయ్యడం తప్పించి ఏమీ చెయ్యలేక పోతున్నాడు లోకజ్ఞానం పూజ్యం అయిన అచ్చన్న — ఒకరిమీద ఒకరు సాకులు చెప్పుకుంటూ బాకులు నూరుకొనే ఆ కజ్జామూకకు సమాధానాలు చెప్పేటంతవాడు కావడం మరి కష్టమే!

అచ్చన్న కిప్పుడే బాధాలేదు కొడుకు పెళ్ళి ఒక్కటీ చేసిపారేస్తే తను కృష్ణా రామా అనుకుంటూ ఓ మూల కూర్చోవచ్చని అతను అనుకుంటాడు. నాలుగైదు సంబంధాలు చూసివచ్చాడు కాని అతని కొక్కటీ నచ్చలేదు. మరో సంబంధం చూశాడు గాని వాళ్ళు వస్తామన్న రోజున కుర్రోణ్ణి చూసుకోవడానికి రాలేదు. అచ్చన్నకా పిల్ల నచ్చింది. పిల్ల ఎఱ్ఱగావుంది. కుర్రోడు కూడ ఎఱ్ఱగా ఉన్న పిల్లే కావాలని గోలెడుతున్నాడు. అంచాత అచ్చన్న ఈ సంబంధం కుదిరితే బాగుణ్ణు అనుకున్నాడు. వాళ్ళు చాల మర్యాదస్తుల్లా కూడ కనిపించారు అచ్చన్నకు, అతనితో వచ్చిన వాళ్ళకు ఆరోజున నిమిషాల మీద పిండివంటలు చేశారు. బలే బాగ మర్యాదచేశారు. కాని వాళ్ళు నూటపదార్లు కట్నం ఇవ్వడం విషయంలోనే ఆగిపోయారేమో అనుకున్నాడు. విడుతులాల బంగారం తను పెడుతూవుంటే ఆ కాస్త కట్నంకూడ వాళ్ళు రాల్చకపోతే ఎందుకూ కొల్చనా అనుకున్నాడు

మాయముండా ముసురు ఇంకా వదల్లేదు అలా తడుస్తూనే ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నారు. బురదలో దిగబడుతూన్న కాలు నూడలాక్కుంటూ తెల్లపంచె, తెల్లచొక్కా, నెత్తిమీద తలపాగ ఉన్న ఓ పెద్దమనిషి, ఓచేత్తో గొడుగు పుచ్చుకొని, ఓచేత్తో పంచెపుచ్చుకొని, నోట్లోని చుట్ట జారిపడకుండానే, అచ్చన్న ఇల్లు ఎక్కడో ఆ త్రోవను పోయేవాళ్ళను అడిగి తెలుసుకున్నాడు. అతని వెనకాలే మరో ముగ్గురు మగవాళ్ళూ, ఓ ఆడమనిషి ముసురును తిట్టుకుంటూ, కాళ్ళు నూడలాక్కుంటూ వస్తున్నారు 'ఓయ్ అచ్చన్న తాతోయ్! మీ ఇంటి కెవ్వరో చుట్టాలొత్తున్నారు' అని అచ్చన్న తాత ఇంటిముందు ఓ పాలికేక పెట్టి అక్కడ నిలబడకుండానే దారి తీశాడు ఓ బుడ్డాడు. అచ్చన్న పేనుతూన్న నులకతాడు నలాగే విడచిపెట్టి 'ఏవూరి చుట్టాల్రా' అంటూ అరుగు దిగాడు. ఆ నల్లగొడుగులూ, తెల్లచొక్కాలూ మాడగానే వాళ్లెవరో అత వాకట్టేశాడు. 'చచ్చిన చావొచ్చిందే! ఇప్పుడీముసల్దాన్ని చంపడాని కొత్తున్నారు కాబోలు. అన్న పెకారంగా రాక ఇప్పుడు రాడమేంటిః' అనుకుంటూ, వాళ్ళవైపే తెల్లపోయి మాస్తూ 'ఏమేః నీళ్ళొట్టుకరా 'అంటూ ఓ అరుపు అరిచాడు. 'నీళ్ళు లేలేక నాను చత్తూంటే—నీళ్ళంటూ ఔంటే!' అని విసుక్కుంటూ బుచ్చమ్మ గుమ్మంవైపు తొంగి చూసేసరికి—నాలుగు జతల మగవాళ్ళ కాళ్ళు ఓ జత ఆడమ్మాయి కాళ్ళు ఆమెకు కనిపించి ఆమె గుండెలు చెల్లాచెదరయ్యేట్టు చేశాయి 'ఈళ్ళందఱికీ ఇప్పు డొంటెలా దేవుడా' అనుకుంది బుచ్చెమ్మ గబాలున బిందెడునీళ్లు అరుగుదగ్గఱకు తీసుకొచ్చింది ఆ వచ్చినవాళ్ళు ఆ నీళ్ళు సరిపోకపోయినా మళ్ళీనీళ్లడక్కుండానే వాటితోనే ఎట్టాగో సరిపెట్టుకున్నారు అచ్చన్న అరుగుమీద నులకమంచం వాల్చి దానిమీద దుప్పటి పడేశాడు బుచ్చెమ్మ ఓ ఎత్తుపీట తెచ్చి ఆ అమ్మాయిని దానిమీద కూర్చోబెట్టింది. దానిమీద ఆమె చిరాగ్గా కూర్చుంది.

'అంతా కులాసా .....' అన్నాడు అచ్చన్న; కాబోయే వియ్యంకుడు రామ్మూర్తితో రామ్మూర్తి అంతా క్షేమమే అన్నట్టుగా తలూపి, 'ఆవేళ రాడానికీలయింది కాదుబావా. పొద్దున్న కబురంపాలనుకున్నాను గాని మా కిట్టగాడు జొరంతో మూలుగుతూ మంచమెక్కాడు. ఈపూట అన్నిదాలా బాగుందంటే— మనలో మనకేటని వచ్చేశాం. ఏమైనా ఇందులో సర్దుకు పోలేనోళ్ళెవ్వరు?' అన్నాడు తన మాటకారి తనాన్ని ప్రదర్శిస్తూ. రామ్మూర్తి 'చాల తెలివైనోడని' అచ్చన్నకు తెలుసు కాని ఏమాట ఎందుకు వాడుతున్నాడో, దీనిలో ఎంతర్థముందో ఊహించుకోగల సత్తా మాత్రం అతనికి లేదు. అంచాతే మొదటవాళ్ళ రాక గుఱించి మనసులో ఆగ్రహించుకున్నా ఇప్పుడదంతా తారుమారై 'అయ్యో పాపం! మీ కిట్టిగాడికి జొరంగా ఉందా? మరేం పెమాదం లేదుకదా' అన్నాడు; ప్రమాదం ఉంటే వీళ్ళిలా ఎందుకువస్తారనైనా ఆలోచించకుండా. వెంటనే రామ్మూర్తి, 'ఆ అ. మరేం ఫరవాలేదు .. ......' అని ఇంకా ఏమేమిటో అంటూండగా, తడిసిన గిరజాల జుత్తుపై కెగద్రోసుకుంటూ, నెత్తిమీద తడిసిపోయిన తుండు కాళ్ళమీద పిండుకుంటూ 'ఈళ్ళంతా ఎవరు చెప్మా' అనే భావం ప్రస్ఫుటమయ్యేలా చూస్తూ అప్పుడే అక్కడకొచ్చి నిలబడిన అచ్చన్న కొడుకును రామ్మూర్తి అలాగే కాస్సేపు చూస్తూ ఉండిపోయాడు. కుర్రాడు నల్లగానున్నగా ఎంతో అందంగా ఉన్నాడు. నూనూగు మీసాలు, ఆ లేత మొగం మాంచి అందమైన ఆ కళ్ళూ, ఆ ముక్కుతీరూ, ఉక్కుకడ్డీలా ఉన్న ఆ శరీరం చూసిన రామ్మూర్తి, తప్పకుండా ఈ కుర్రోడే మా అల్లుడు అనుకున్నాడు.

'ఈడే మారామయ్య' అన్నాడు అచ్చన్న.

'ఈగోజిల్లో ఇంకా రామయ్యేటి బావా. ఇక్కడనుంచి మేం రామారావు అంటాం' అన్నాడు రామ్మూర్తి; అప్పుడే కాబోయే అల్లుణ్ణి బుట్టలో వేసుకోవాలనే తలంపుతో. రకీమని తలవంచేశాడు రామారావు నవ్వుతూ ఈమాట కెంతో ఉబ్బిపోయాడు ఇంక అక్కడ ఒక్కక్షణం ఉండలేక ఆ ప్రక్కనే ఉన్న గొడ్లపావిట్లోంచి తల్లిదగ్గఱకు చేరాడు అతను నడుస్తూ ఉండగా ఆ అయిదుగురూ అతని వైపే చూసి మళ్ళీ వాళ్ళంతా ఒకరిచూపులొకరు కలుపుకొని 'ఏం ఎలాగున్నాడు' అని కనురెప్పలతో ప్రశ్నించుకున్నారు. 'ఓః ఎంచక్కా ఉన్నాడు' అన్నట్టుగా అందఱికళ్ళూ ఒక్కసారి ముచ్చటగా నవ్వాయి 'ఏం బంగారమ్మా ఎలాగున్నాడు మా అల్లుడు?' అన్నాడు రామ్మూర్తి

బంగారమ్మ నిండుహృదయంతో 'బాగున్నాడన్నయ్యా' అంది. అప్పుడే కోడిపుంజు 'నేనూ ఇక్కడ ఉన్నా' నన్నట్టుగా వాళ్ళ నెత్తిలమీంచి ఎగిరి గుమ్మం బల్లమీద నిలచింది. ఆ పుంజును చూడగానే, ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకడు, 'సంకురాత్రి పందేల కేటిమావా' అన్నాడు. జవాబుగా అచ్చన్న, 'దానికివాల ఆయువు మూడేదే. చుబమా అంటూ దాని పేణం తీయడమెందుకని మానేశాను. అయినా ఇది ఆచారం కాదుగా.' అన్నాడు. ప్రతీ మాటకూ ఎంతో విలువ కట్టే రామ్మూర్తి తన కూతుర్ని కోడలుగా చేసుకోవాలని అచ్చన్న ఉబలాట పడుతూన్నట్టుగా ఈ మాటలనుబట్టి గ్రహించొచ్చు అనుకున్నాడు. కాని అచ్చన్న కట్లాంటి అర్థాలేవీ తెలియవని ఆ తరువాత కొద్ది క్షణాలలోనే అతని అమాయకపు ప్రవర్తనబట్టి గ్రహించాడు.

అసలే మసాబుగా ఉందేమొ, అప్పటికే అయిదుగంటలు దాటిఉంటుందేమొ ఆ చీకటికొంప మరీ చీకటి రాసులతో తులతూగుతోంది. 'ఒరే రామిగా ఆ కిటికీ తియ్యరా' అంది బుచ్చమ్మ వంటపనులు చేసుకుంటూ కొడుకుతో. వాడు మామూలుగా ప్రయత్నిస్తే ఆ కిటికీ రెక్కలో పట్టాన ఊడొస్తాయేమిటి? బయటనుంచి కర్రతో పొడిచి, మళ్ళీ గదిలోకివచ్చి వాటిని పట్టుకలాగితే మెల్లగా కిర్రు పెడుతూ అవి వెనక్కు వచ్చాయి. అప్పుడే ఎర్రగా ఆ కిటికీకి అవల తళతళా మెరుస్తూ ఓ అమ్మాయి పకపకా నవ్వింది. ఎవరా అమ్మాయి అనుకుంటూ నిదానించి చూశాడు. అబ్బే అక్కడెవ్వరూ లేందే! కోడిపుంజు మాత్రం ఆ అరుగుమీద ఎర్రని జుత్తు నెత్తి తమాషాగా వానను విలోకిస్తూంది; మళ్ళీ గుమ్మం మీదనుంచి ఎప్పుడు క్రిందకు దిగిందో మరి! కుర్రవాడికేమీ తోచలేదు. ఇంట్లో దీపం వెలిగించాడు. ఇల్లంతా ఎర్రగా అయింది. ఆ గది నిండా మందారపూలు పూచినట్లయింది. అతని శరీరం స్వాధీనంలోనికి వచ్చేప్పటికి, తల్లి కట్టుకున్న ఎర్రచీర గుమ్మంలోంచి కదలిపోయింది.

క్రమేణా చీకటిపడింది. ఆకాశంమీంచి ఎవ్వరో చీకటికొండలను త్రవ్వి భూమ్మీద రాసులు పోస్తున్నట్లుంది. బ్యాటరీలైటును చాల పొదుపుగా వాడుకుంటూన్న వాళ్లలా, అనంత మార్గాన పోతూన్న పాంథులెవ్వరో విద్యుల్లతను చటుక్కున వెలిగించి ఆర్పేసినట్లుగా మెరుపు వియత్తలమెల్ల నిండి మరోక్షణంలో మాయమైపోయింది. అది చూడగానే కుర్రవాని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. 'ఒరే అరుగుమీద దీపం పెట్టరా' అన్నాడు తండ్రి. ఈ మాటలు అతనికి వెనువెంటనే వినిపించలేదు. అగ్గిపుల్ల మండడం—హరికేన్ లాంతరునిండా కాంతి నిండడం—అతని తలలో ఎర్రగా బక్కపలచగా ఉన్న పిల్ల నల్లని కళ్ళతో సన్నగా నవ్వి మురిపెంగా అంతర్థానమైపోవడం జరిగింది. చల్లగా గాలివీచి అతని తలను ప్రేమతో గారాబంగా నిమురుతూ వెళ్ళింది.

బుచ్చమ్మకు వంటలు చేతకావు. ఒయ్యారపు పిల్లల్ని పిలచి నాజూకు వంటలు వండించడానికి అప్పుడింట్లో ఏమీ లేవు. ఇంట్లో పాడిఉంది. కాబట్టి గబగబా పరమాన్నం వండింది. వాళ్ళకదే హెచ్చుగా పడేసి, ఘుమఘుమలాడే నేయి వద్దు వద్దంటున్నా హెచ్చుగా పోసేసింది.

అన్నం తింటూ రామ్మూర్తి బావమరిది, 'ఏంటీ కంపు ఈ కొంపలో' అన్నాడు. దానికి కారణం నేనే నన్నట్టుగా ఓ గబ్బిలం ఓసారి ఆయింట్లో కంగారుగా పచారుచేసి, అపచారం చేసినట్లుగా హడావుడిగా అవతలకు వెళ్ళిపోయింది. 'అబ్బ! కారం ఈ కూరలో ఎంత పడేసిందో! తినలేం బాబూ ఈ తిండి. ఎలా తింటారో కాని వీళ్ళు.' అన్నాడు ఆ బావమరది మళ్ళీ; సగం బుచ్చెమ్మకు వినిపించీ వినిపించనట్టుగా నసుగుతూ. వెంటనే రామ్మూర్తి కాబోయే వియ్యపురాలు వినేటుగా, 'పెద్దలకాలపోళ్ళురా. ఆళ్ళ జీవితం అట్టాగే పోద్ది. మనకు కానీ డబ్బు లేదు గాని ఈసాని కిరిగిపడతాం; ఏసాలకేమో ఎగిరిపడతాం' అన్నాడు. ఈ మాటలకు బుచ్చమ్మ ఎంత సంతోషిస్తుందో అతనికి బాగా తెలుసు. నిజంగా ఈ మాటకు బుచ్చెమ్మ ఉక్కిరి బిక్కిరయింది.

ఆ మరునాడు వాళ్ళు వెళ్ళిపోతూ, అంతా ఖాయమే అన్నారు. పెళ్ళి మాఘమాసంలో అన్నారు. ఎప్పటినుంచో అడగాలని అడగలేక పోతూన్న అచ్చన్న, 'మరి.........' అని ఏదో చెప్పబోయేప్పటికి, ఆ వియ్యంకుడు రామ్మూర్తి, 'తలతాకట్టు పెట్టైనా ఇచ్చేస్తానుగాని మరోలా చేస్తానా. అలాంటిదేమీ పెట్టుకోకు బావా......' అంటూ 'వస్తానప్పా' అని వియ్యపురాలివద్ద శలవు తీసుకొని, సాగిపోయాడు. బస్సునిలచే స్థలంవరకూ చుట్టాలను సాగనంపి అచ్చన్న ఇంటికి తిరిగి వచ్చాడు.

మాఘమాసం రావడం ఎంత? పెళ్ళి దగ్గఱ పడడం ఎంత? ఆ ముసలాళ్ళకు ఒక్క పనీ సాగడంలేదు. పెళ్ళికి ఏయే పనులు చేయాలో తోచడమూ లేదు. ఇంటి గోడలకు సుద్ద పులిమారు. అరుగులకు పేడ పూశారు. ఆ పేడ పూతపెట్టిన అరుగులకు మధ్యగా పొడుగునా సుద్దచుక్కలు పెట్టించారు. గుమ్మాలకు పసపురాసి కుంకుమ బొట్లు చిత్రింపించారు. గుమ్మాల పైన మామిడాకులు కట్టారు. కిటికీలు రెండూ ఇప్పుడు తెఱచే ఉంచారు. కానిఎంతచేసినా ఆ ఇంటికి తీసుకరావలసిన అందాన్ని మాత్రం తీసుకరాలేక పోయారు!

కుర్రాడికి క్రొత్త చొక్కాలు కుట్టించారు. క్రొత్త పంచెలు కొన్నారు. పెళ్ళి కొడుకును చేసినరోజున వద్దన్నా కుర్రాడు ఊరంతా తిరిగాడు. తలంటుపోసుకొని, అప్పుడే ఆరినజుత్తూ, ఆ కళ్ళ కందంగా కాటుక, మొగాన పెళ్ళిబొట్టు, బుగ్గను చుక్కా, చేతులకు గంధంపూతలు, కాళ్లకు పారాణి వ్రాతలు చూసుకొని, కుర్రాడు తెగమురిసిపోయాడు. 'ఏందిరోయ్ నల్లోడా! ఎర్రపెళ్ళాం వస్తాదని తెగమురిసి పోతున్నావ్' అన్నాడు వాళ్ళింటిముందు నుంచి పోతూన్న పెద్ద దొర. దొరముందు కనీసం వాడు రెప్పపాటు నిల్చోలేకపోయాడు. నిలుచున్న ఆక్షణం అతని కుడికాలు ఎడమకాలిని పెనవేసుకొని భూమ్మీద ఇట్టిటుతాకింది. అప్పుడే ఎడమచేతి చూపుడు వ్రేలును వీపు వెనకభాగాన కుడిచేయి నలుపుతూండగా, అతని శరీరం విచిత్రమైన భంగిమలుపోయింది. ఈ పరమాద్భుత ముగ్ధలావణ్యాన్ని తిలకించిన దొర ముసిముసి నవ్వులతో దారితీశాడు. రామిగా డింట్లోనికి గబగబా పరుగెత్తాడు. అయితే అక్కడెవ్వరూ ఈ ఆనందాన్ని వీక్షించే వారు లేరు. అతని ఆనందం అతనిలోనే నిండి అతనికి అపరిమితమైన ఉత్సాహాన్ని కూర్చింది.

ఈ వారం రోజులనుంచీ అచ్చన్నకు చేతినిండా ఏదో ఒక పని ఉంటూనే ఉంది. పాపం అన్ని పనులూ అతనొక్కడే చేసుకోవలసి వస్తూంది. అయినా నిరుత్సాహంగా లేడనే అనాలి. ఏపని చేస్తున్నా అతని మనసు ఒక్కసారిగా ఆ రామ్మూర్తి ఇచ్చే కట్నం మీదికే దుముకుతూంది. అది అచ్చన్నను హుషారుగా ఉంచడానికి మా బాగా పనిచేస్తూంది. అసలా గూడెంలో అంత కట్నం పుచ్చుకోగలిగిన మొనగాడీ అచ్చన్న ఒక్కడే అనాలి. ఇదేభావం అచ్చన్న గుండెలో దండిగా నిండుకుంది. ఏపని చేస్తున్నా అచ్చన్న కా కట్నమే ఎదురై పదిమంది మనుష్యులుకూడ చెయ్యలేనంత సహాయాన్ని ప్రతి ఫలాపేక్ష

(42-వ పేజీ చూడండి)

# ★ మేధావి ★

(25-వ పేజీ తరువాయి)

లేకుండా చేసి పెట్టేస్తోంది! ఇహ ఎవరు కనబడినా అచ్చన్న ఈ కట్నం విషయమే చెప్తూ వాళ్ళచేత, 'మొత్తంమీద గట్టోడి వేరా నువ్వు' అనిపించుకోకుండా ఉండలేక పోతున్నాడు. ఈ విషయాన్ని అచ్చన్న ఇతరులకు చెప్పేటప్పుడు చాల నిరాడంబరంగానే చెప్తూన్నట్లుఉంటాడు. కాని అతని మనసు నిండా ఈ విషయమై ఆడంబరమే అల్లుకపోయి ఉందని చెప్పడంలో అతిశయోక్తి కించిత్తూ లేదు. అయితే ఉన్నట్టుండి ఇంత ఆనందాన్ని అతని లోంచి పిండి పారేయడానికే నన్నట్టుగా ఓ పాలికాపు 'ఏంది మావోయ్! మీరామి గాడికి ఆ రామ్మూర్తిగాడి పిల్లని పెళ్ళి చేస్తున్నావటే! ఆడు చానా అగండుడు. ఆడితో యవ్వారం కట్టమే. ఇంతకీ ఏం ఇత్తానన్నాడేంటి కట్నం' అనేసరికి, అచ్చన్న ఆ పుచ్చుకోపోయే దెంతో కాస్త మెల్లగా చెప్పాడు. వెంటనే ఆ పాలికాపు 'నూటపదార్లే......ఏమో నాకు నమ్మకం లేదు. ఆ డంత ఇత్తాడంటే నాను నమ్మను' అంటూ వెళ్ళిపోయాడు. ఈ మాట విన్న బుచ్చమ్మ 'ఈ జులాయోడి మాటకేంలే. ఈ ఎదవకేంటి నోటి కలాఒత్తే అలాగే ఒగుతాడు' అంది. పాపం అచ్చన్న ఎంచాతనో దీర్ఘాలోచనలో పడిపోయాడు.

పెళ్ళి రాత్రి కనగా ఊళ్ళో అసాటి మధ్యాహ్నం భోజనాలు పెట్టుకొని బస్సులో కొంతమంది పెద్దలను అచ్చన్న బయలు దేర తీశాడు. పెళ్ళి కొడుకునూ బుచ్చెమ్మనూ కొంతమంది చుట్టాలనూ ప్రొద్దున్నే అక్కడకు పంపాడు.

అచ్చన్న బయలుదేరతీసిన పెద్దలందరూ వేషాలకీ నిషాలకీ పేరుమోసిన రకం. వాళ్ళేదోవిధంగా అచ్చన్న నుదగా చెయ్యని సంఘటనలు చాల అరుదు. అయితే అచ్చన్నకు అంతకన్నా మరి పెద్దలూ లేరనే అనాలి.

వీళ్ళందరికీ బస్సు టిక్కెట్లు కొని అచ్చన్నకూడ బస్సెక్కాడు. బస్సు పరుగెడుతూంటే అచ్చన్న బుర్రలో అనంతంగా అవుతూన్న ఖర్చులుకూడ దొడు తీశాయి. ఖర్చులప్పుడే రెండువందలు దాటిపోయాయి. దాచిన డబ్బు ఇట్లా దారి చేసుకొని పారిపోతూంటే అచ్చన్న గుండె దిగాలుపడిపోయింది. అయినా 'కట్నం వత్తాదిగా అప్పుడింత కర్చునిపించదు' అనుకున్నాడు. కాని ఈ కట్నంమాట తలపుకురాగానే అతని గుండె లెందుకో దడదడ కొట్టుకోవడం మొదలు పెట్టాయి.

బస్సులోంచి అచ్చన్న కాలు క్రింద పెట్టగానే, రామ్మూర్తి ముచ్చటగా పలుకరించాడు. ఈ మర్యాదకు తన్మయుడైన అచ్చన్న 'చీఛీ. ఇంత మంచోడు చత్తే మరోలా చేత్తాడా? ఎదవ. ఆ జులాయోడి మాటలకేంలే.' అనుకున్నాడు.

అయితే ఒక్క అచ్చన్ననే రామ్మూర్తి పలకరించి ఊరుకోలేదు. ఆ వచ్చిన వాళ్ళందరితోనూ అతను ఎంతో కలుపుగోరుతనంగా మాట్లాడాడు. ఇంటిదగ్గఱ ఈతచాపలు తనే పఱచి వాళ్ళందరూ వాటిమీద ఆసీనులయ్యేట్టు చేశాడు.

ఆ అరుగుమీద కూర్చున్నాడన్నమాటే గాని అచ్చన్న బుర్రలోకి ఆ కట్నం మళ్ళీ తుర్రున ప్రవేశించింది. అది అందులో రెక్కలు కొట్టుకొని ఎగురుతూంది. అది ఒకొక్కసారి మెదడు కదలిపోయేట్టు దెబ్బ

## కుప్పనూర్పిడి



కొడుతూంది. ఒకొక్కసారి విమానంలో కూర్చోబెట్టి హాయిగా ఆకాశంలోకి తీసుక పోతోంది.

ఈఆలోచనలగొడవలో అచ్చన్న తనతో వచ్చిన జనం సంగతే మరచిపోయాడు. తీరా చూసేసరికి వాళ్లెక్కడా అయిపు లేరు. వీళ్ళంతా ఏమయ్యారు చెప్మా అని అచ్చన్న విస్తుపోయాడు. భోజనాల వేళ కావచ్చినా ఒక్కడూ పికరు లేడు. వాళ్ళంతా తప్పత్రాగి ఊగుతూ తూలుతూ అక్కడకు హాజరయ్యేప్పటికి తొమ్మిదయింది. 'ఓరి మిమ్మల్ని తగలెట్ట, ఇక్కడ కూడ మీకు తాగుడేనా' అని నాలుగు తిట్టాలనుకున్నాడు. కాని అదేమీ లాభం లేదని పాపం ఆ మరుక్షణంలోనే అనుకోక తప్పింది కాదు. ఒకడు అచ్చన్న దగ్గఱకొచ్చి 'రాజులాంటి పిల్లని చేత్తున్నావురా. నల్లోడి కింక చోర్గమే' అన్నాడు. మరొకడు రామ్మూర్తిని తెగ పొగడి పారేశాడు. ఇదంతా చూస్తూంటే అచ్చన్నకి మతోయింది. 'ఎదవ చచ్చినోల్లు! ఈళ్ళని రమ్మనకపోయినాబాగుణ్ణు' అనుకున్నాడు.

పెళ్ళి పందిఱి ఏమంత అట్టహాసంగా లేదు. ఏవో నాలుగు వెదురు కఱ్ఱలు పాతి, అయిదారు కొబ్బరాకులు వాటిమీద పడేశారు. ఓ పిట్రొమాక్సు లైటు పందిఱిలో పెట్టారు. ముహూర్తం సరిగ్గా ఒంటిగంటన్నరకి. కాని అక్కడ ఒక్కడిదగ్గఱా గడియారం లేనేలేదు. తాగిన సోదరులు పీకమొయ్యా మెక్కేశేమొ ఎక్కడ కాళీ ఉంటే అక్కడ చేరబడి పోయారు.

పెళ్లి ఆర్భాటమంతా పంఽడెండుగంటల నుంచి ఆరంభమయింది. అయితే అప్పుడు పంఽడెండే అయిందని చెప్పడానికేమీ ఆస్కారము లేదు. శాస్త్రులుగారు గడియారంవైపు చూసేసరికి అది ఎక్కడో యుగయుగాలవెనుక ఆగిపోయినట్లుగా ఉంది. వెంటనే ఆయన ఆ కాలం తెలిపేబొమ్మకు జీవంపోసి, పెళ్ళికి వేళయినట్లుగా సూచించారు. పెళ్ళికొడుకును, పెళ్ళికూతుర్ని పీటల మీద కూర్చుండబెట్టారు. పెళ్ళికొడుకు పిల్ల ఎరుపుమూసి ముర్సిపోయాడు. ఏమాత్రం వీలున్నా కళ్ళు ఆపిల్లమీదికేపోనిస్తూ ఎంతో సంబరపడుతున్నాడు. బుచ్చమ్మ కోడలి అందానికి అబ్బురపడిపోయింది.

అచ్చన్న తను తీసుకవచ్చిన మూక అంతా వట్టి దండుగమూకక్రింద నిర్ణయించుకోక తప్పింది కాదు. కట్నం వియ్యంకుడి చేత ముందుగానే చెల్లించుకోవాలంటే వాళ్ళ అండ ఎంతైనా అవసరమే! కాని వెధవలు ఎక్కడివాళ్లక్కడ మతుల్లేకుండా పడిపోయి ఉన్నారు. కొంతమంది పెళ్ళి ముందువచ్చి కూర్చున్నారుగాని, వాళ్ళకేమి మాట్లాడాలో వాళ్ళకే తెలియదు. అయినా అచ్చన్న ధైర్యంచేసి అడిగెయ్యాలనుకున్నాడు.

ఒక్కసారి కంఠం సవరించుకొని, కొంచెం తటపటాయిస్తూనే, 'చాత్రులుగారూ...కట్నం సూటపదార్లూ చూపించమనండీ...ఆనక ఎటోయి ఎటొచ్చినా...' అన్నాడు అచ్చన్న. శాస్త్రులుగారు, రామ్మూర్తివైపు ఈమాటకు సమాధానం చెప్పవయ్యాఅన్నట్టుచూశారు. రామ్మూర్తి కాళ్ళల్లో వణకు పుట్టింది. అయినా నిలద్రొక్కుకున్నాడు. అలా నిలద్రొక్కుకొని, అచ్చన్నకు దగ్గఱగావచ్చి, మెల్లగా 'ఒక్క సెల్లాళ్ళో నీచేతిలో పెడతా బావా. ఎక్కడా సర్దుబాటయిందికాదు. ఈ తప్పు నువ్వుకాయాలబావా...' అంటూప్రాధేయపడేసరికి, అచ్చన్న కుదేలయిపోయాడు. అతని మొగం వికృతంగా మారిపోయింది. 'ఏంటీ...సర్దుబాటుకాలే...మరావేళ తల తాకట్టెట్టైనా ఊడబొడిచేత్తాన్నావుగా... ఈపాటిదానికే అంతమాటన్నావ్...చాల్చాల్లే మరియాద...ఏయ్ లెండిరా పోదాం ఒకే లేరా...లే...పెళ్ళివద్దూ పెడాకులూ వద్దు ... లే... మరియాదత్తులంట, మరియాదత్తులు ... ఛీ ...'అనేసరికి పెళ్ళికొడుకు లేచిపోవాలేమోఅన్నట్టుగా లేవబోయాడు. ఇంతలో అతని మనసు కూర్చోమని బలవంతం చేసింది. ఇంతలో తండ్రి మళ్ళీ, 'లేవేరా' అని ఘర్జించాడు. అట్లా ఘర్జించి, 'ఇక్కడికి తీసుకొచ్చి ఇంత మరియాదచేత్తావనుకోలేదు. అక్కడేవిన్నాను నువ్విట్లాంటి మరియాదత్తుడవే నని' అన్నాడు. ఆవేళ చూపులకు వచ్చిన రామ్మూర్తి బావమరది, 'చాల్లేవయ్యా... కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళివ్వలేకపోయావుగానిమరియాదమాటెత్తుతున్నావు. మహామరియాద తెలిసినోడివి ఎట్లాగయితేం బయలుదేరావు కాని' అని అంటూంటే ఆవేళ అక్కడకు వచ్చిన ఆడకూతురు, 'ఇక్కడైదేనిపిండొంటలతోటి సెల్లి, అక్కడ ఇంతకారం ముద్దపడేసిన నువ్వే చెప్పాలి మాకు మరియాద' అంది. ఇంతలో ఆ బావమరది మళ్ళీ అందుకొని, 'ఆ గబ్బిలాలకొంప మరియాదలకేం లేవే...'అన్నాడు. వెంటనే రామ్మూర్తి, భయంకరంగా 'ఏంటిరా ఎధవా పేలేవ్...నోర్ముయ్' అని సింహంలా వాడిమీదకురికి ఛెళ్ళున ఒక్కటిలాగి, 'ఇదిగో బంగారమ్మ నువ్వు ఆడదానివైయావే...' అంటూ ఆవేశంతో పళ్ళు పటపటా కొరికి, అచ్చన్న చేతులు పట్టుకొని అతిజాలీగా, 'ఇవి చేతులుకావు ... కాళ్ళు ... ఈ గండం ఇక నువ్వే గట్టెక్కించాలి. ఈ కుఱ్ఱకుంకల మాటలు నువ్వు పట్టించుకోకుబావా...' అన్నాడు ఏకబిగిని. అచ్చన్నకు — ఏమి జవాబు చెప్పాలో, ఇక అప్పుడు ఏమి మాట్లాడాలో తోచలేదు. అతని మనసు నిండా ఆ చెంపకాయే తిరుగుతూంది. 'రామ్మూర్తి ఎంత మంచివాడు. ఎంత మర్యాదస్తుడు' అని ఆ చెంపకాయ రామ్మూర్తిమీద అనేక రకములైన సద్భావాల్ని అచ్చన్న హృదయంలో మొలకలెత్తించింది. ఈ దృశ్యం చూసిన బుచ్చెమ్మ ఇక తన మొగుడు సాగదియ్యకుండా ఉంటే అదే పదివేలని మదిలో పదివేల దేవుళ్లకు మ్రొక్కుకుంది. ఇంతలో ఆ వూరి పెద్దలు, అచ్చన్నదగ్గఱకొచ్చి 'ఇచ్చేస్తానంటున్నాడుకదయ్యా ...ఇప్పుడిక్కడనుంచి వెళ్ళిపోతే ఏమొస్తుంది...అయిన ఖర్చులదండుగతప్ప ఇంకేమీ రాదు. ఇంకెందుకొచ్చినగొడవ ...' అంటూ వుంటే అచ్చన్న మాటా మంతీ లేనివాడైపోయాడు. పాపం పూర్తిగా నిస్సహాయుడైపోయాడు. అప్పుడే రామ్మూర్తి బుచ్చమ్మదగ్గఱకుపోయి, 'నువ్వయినా చెప్పుఅప్పా'అంటూ బుచ్చమ్మచేతులు పట్టుకున్నాడు. బుచ్చమ్మకు ఏమి చెయ్యడానికీ తోచింది కాదు. కాని, 'అఽమావదగ్గఱ ఆడు వనూలు చేసుకోకుండా ఉంటాడేంటి' అంది. ఈమాటతో అంతా గొల్లున నవ్వారు. వెంటనే ఎవ్వరో, 'చాత్రులుగారూ ఇక మీరు కానివ్వండి' అని అరచి, 'ఊ వాయించండోయ్ బాజా భజంత్రీలు' అనేసరికి పెళ్ళినిమిషాలమీద 'మారామూడు...పెళ్ళికొడు.. కాయనే...'దగ్గరకుచేరిపోయింది. అచ్చన్న 'వ్ఱ్రిమొగం వేసుకొని' అట్లా నిలబడి పోయాడు. అచ్చన్న గుండెలో ఎవ్వరో కట్నం కట్నం అని అరుస్తూనే ఉన్నారు. కాని అది ఆ బాజాలమోతలో ఎవ్వరికి వినిపిస్తుంది!

శాస్త్రులుగారు రామ్మూర్తిదగ్గఱ పుచ్చుకోవలసిన దేదో పుచ్చుకుంటూ 'ఆరి నీదుంప తెగా...నీవు మేధావివిరా. ఆ వెధవలకు త్రాగుడుపోసి మీ బావమరదిగాడికి ఒక్కటి వడ్డించి, సూటపదహార్లూ మా చక్కగా స్వంతం చేసుకున్నావురా ...' అంటూంటే, అప్పటివరకూ తను చేసిన ఘనకార్యానికి మనసులోనే అతీతమైన ఆనందాన్ననుభవిస్తూన్న రామ్మూర్తి తన గొప్పతనాన్ని గుర్తించిన శాస్త్రులుగారిముందు ఎంతో హుందాగా నవ్వి, 'ఉఱ్ఱైడు బుద్ధులూ పొట్టకొఱకేగదాండి' అనేసి, వియ్యంకుణ్ణి మర్యాద చేయడానికి వెళ్ళిపోయాడు. ★